క్లుప్తంగా

అర్హులందరికీ భూముల పంపిణీ

సైదాపురం: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం భూములు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని దేవరవేమూరు, తురిమెర్ల, రామసాగరం, ఊటుకూరు గ్రామాల్లో శుక్రవారం అసైన్‌మెంట్ గ్రామ సభను నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన అసైన్‌మెంట్ కమిటీ అర్హులైన వారి వివరాలను చదివి వినిపించారు. అనంతరం గ్రామ సభ ద్వారా తీర్మానం ఆమోదించారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రీసర్వే డీటీ ప్రసాద్, ఆర్ఐ అశ్వర్థారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళమ్మ గ్రామోత్సవం


పుర వీధుల్లో విహరిస్తున్న తాళమ్మ

గూడూరు: పట్టణ శివారు ప్రాంతంలోని గూడూరు గ్రామ దేవత శ్రీ తాళమ్మ గ్రామోత్సవం ఆదివారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో ఘనంగా నిర్వహించారు. తాళమ్మ అమ్మవారిని దర్శించుకుని ఆ తర్వాత భోగి మంటలు వేయడం 4 శతాబ్దాలుగా ఆనవాయి తీ. ఈ నేపథ్యంలో రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణల మధ్య అమ్మవారికి గ్రామోత్స వం నిర్వహించారు. తొలుత అమ్మవారికి ముందు ఆమె సోదరుడు కాటమయ్య ఊరేగింపు సాగింది. పలు కూడళ్ల వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తల్లంపాడులో వైద్య శిబిరం


తల్లంపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడు గ్రామంలో శుక్రవారం తొగరాముడి పీహెచ్‌సీ వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. గర్భిణులకు వైద్య సేవలందించారు. బీపీ, షుగర్ బాధితులకు వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ తరుణ్ సాయికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ రసూషా, సిబ్బంది జనార్దనయ్య, కామేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డీడీఓను కలిసిన జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యుడు

గూడూరు రూరల్: తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన గూడూరుకు చెందిన నన్నూరు వెంకటరమణయ్య శుక్రవారం తిరుపతిలో కమిటీ కన్వీనర్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్యను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు విన్నవించారు.

ఎర్రచందనంపై అక్రమ రవాణాపై నిఘా



రాపూరు: పండుగ రోజుల్లో ఎర్రచందనం అక్రమ రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. రాపూరు అటవీశాఖ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసి మాట్లాడారు. పండుగ మూడు రోజులు కీలకంగా పరిగణించి గస్తీ ముమ్మరం చేశామన్నారు. అటవీ శాఖ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను విడుదల చేసినట్లు తెలిపారు.

నాణ్యమైన కందిపప్పు సరఫరా..

సైదాపురం: ఇంటింటికీ బియ్యంతో పాటు నాణ్యమైన కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు రాపూరు సీఎస్ డీటీ లక్ష్మీనారాయణ రెడ్డి పేర్కొన్నారు. సైదాపురం, చాగణం, తురిమెర్ల తదితర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల ఇంటి కెళ్లి కందిపప్పు నాణ్యతగా ఉందా, లేదా? అని ఆరా తీశారు.

ఐడీ కార్డులు ఇవ్వరూ!

గూడూరు: తమ ఆటోలకు పోలీసు నంబర్లతోపాటు ఐడీ కార్డులను ఉచితంగా ఇవ్వాలని ఆటో యూనియన్ నాయకులు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డిని కోరారు. శుక్రవారం డీఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి ఆటో యూనియన్ నాయకులు బీవీ రమణయ్య వినతిపత్రం ఇచ్చారు. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, చిన్న, ధనయ్య, రమేష్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో సీఐ సమీక్ష


మాట్లాడుతున్న సీఐ హరికృష్ణ

వాకాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వాకాడు సీఐ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పోలీసులు, గ్రామ మహిళా పోలీసులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసులతోపాటు అదనంగా ఒక్కో పంచాయతీకి ఒక హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌ను నియమిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐలు రఘునాథ్, పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీల కోలాహలం


గూడూరు : వెటరన్స్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కనుమూరు హరిచంద్రారెడ్డి


వెంకటగిరి : మాట్లాడుతున్న కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి


వెంకటగిరిరూరల్ (బాలాయపల్లె) : జయంపులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కార్తీక్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వార్డు స్థాయి క్రికెట్‌పోటీలు శుక్రవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభించారు. రాజా కుటుంబీకుడు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర, ట్రస్ట్ అధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, నెల్లూరు గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతుశారద, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీపీ టి.తనూజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు సీహెచ్. ఉమామహేశ్వరి, ఎస్.బాలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గూడూరులో వెటరన్స్ క్రికెట్..

గూడూరు: స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శుక్రవారం ఆట్టహాసంగా వెటరన్స్ క్రికెట్ పోటీలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు హరిచంద్రారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని వెటరన్ క్రికెట్ టోర్నీని మూడురోజుల పాటు నిర్వహించనున్నట్టు చెప్పారు. 13 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గూడూరులో పుట్టి తిరుపతి, నెల్లూరు జిల్లాలలో స్థిరపడిన వారు ఈ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, రవీంద్రబాబు, దేవానంద్, అహ్మద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయంపులో వీకేఆర్ క్రికెట్..

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లె) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని బాలాయపల్లె మండలం జయంపులో 5 రోజుల వీకేఆర్ క్రికెట్ టోర్నీని శుక్రవారం పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు.బాలాయపల్లె, గూడూరు రూరల్, ఓజిలి మండలాలకు చెందిన జట్లు టోర్నీలో పాల్గొంటున్నట్టు ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లెల వెంకటేశ్వర్లు, టోర్నీ నిర్వాహకులు నాగరాజు, కోటి, కార్తీక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ టోర్నీ


బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభంలో మాట్లాడుతున్న యాచేంద్ర

వెంకటగిరి: స్థానిక వీఏస్ ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను రాజా కుటుంబీకుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, క్రీడలతోనూ ఉజ్వల భవిత పొందవచ్చన్నారు. శ్రీ కళ్యాణరామ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు రూ.7వేలు, రూ.4వేలు, రూ.2వేలు నగదు బహుమతి ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే మొత్తం 50 టీమ్‌లు టోర్నీలో పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, మున్సిపల్ లీగల్ అడ్వైజర్ జయప్రకాష్‌శెట్టి, ఏఎంసీ డైరెక్టర్ జలగం కామాక్షి, వి.మధునాయుడు, డాక్టర్ కె.సంజీవరాయుడు పాల్గొన్నారు.

తడలో ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు ఇస్తున్న ఎమ్మెల్యే

తడ: సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం తడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలను వారు అభినందించారు. ఓ పురుషుడు సైతం ముగ్గుల పోటీలో పాల్గొని అందమైన ముగ్గును వేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఎంపీపీ కొళవి రఘురెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ రామయ్య, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, వెలుగు ఏపీఎం రాజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు మునీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, నాయకులు ఆర్ముగం, మునిరత్నంరెడ్డి, కోదండం, సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న డాక్టర్ భాస్కరయ్య

పెళ్లకూరు: వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ భాస్కరయ్య సూచించారు. జీలపాటూరులో శుక్రవారం 'వైఎస్సార్ పొలంబడి' నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. వరిసాగులో విత్తన ఎంపిక, విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం గ్రామంలోని వరిపంటను పరిశీలించి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల వ్యవసాయశాఖ అధికారులు డాక్టర్ ప్రవీణ, గణేష్, హైమావతి, సర్పంచ్ కందమూడి శివకుమార్, శ్రీనివాసులు, వేణుగోపాల్, వివిధ గ్రామాల వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్

చిల్లకూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావుకు నివేదించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్వర్ణ అన్నారు. లింగవరం సచివాలయంలో శుక్రవారం ఆమె గడప గడప సమస్యలపై సమీక్షించారు. లింగవరం, పల్లెవాని దిబ్బ గ్రామాల్లోని గిరిజనులు ఎదుర్కొంటున్న శ్మశాన భూమి సమస్యపై దృష్టి సారించామన్నారు. ఈ రెండు గ్రామాలు ఇప్పటికే కృష్ణపట్నం పోర్టు పరిధిలో ఉండడంతో వారికి కేటాయించని భూములలో శ్మశానాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అలాగే కొంతమందికి నివేశస్థలాలు మంజూరు చేసేందుకుగాను ఇంటింటా సర్వే చేసి జాబితా సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక రోడ్డుకు రూ.20లక్షలు

-తిరుపతి ఎంపీ గురుమూర్తి హామీ


హిందూ శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎంపీ మద్దెల గురుమూర్తి

నాయుడుపేట: నాయుడుపేట హిందూ శ్మశానవాటిక రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి హామీ ఇచ్చారు. శుక్రవారం స్థానిక హిందూ శ్మశానవాటికను ఎంపీ సందర్శించారు. రోడ్డు, ఇరువైపులా పూలమొక్కల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. నిధుల మంజూరు విషయమై స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కిషోర్‌రెడ్డి, చదలవాడ కుమార్, విశ్రాంత ఉద్యోగులు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


హిందూ శ్మశాన వాటికను పరిశీలిస్తున్న దేవసేనమ్మ తదితరులు

శ్మశాన వాటిక పరిశీలన

గూడూరు: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. శుక్రవారం జనార్దన్‌రెడ్డి కాలనీ ప్రాంతంలోని హిందూ శ్మశానవాటికను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, శ్మశానాన్ని శుభ్రం చేయించినట్లే డంపింగ్ యార్డును కూడా రోడ్డు మార్జిన్‌కు దూరంగా ఉండేలా శుభ్రంగా చేయాలని కమిషనర్ సాయినాథ్‌కు సూచించారు. పట్టణ ప్రజలంతా ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, కోదండరామయ్య, శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ


తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి

నాయుడుపేట: నాయుడుపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులు, డైరెక్టర్లతో సమీక్షించారు. అధికారులు సమయపాలన పాటించాలన్నారు. రైతులకు సత్వర సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ అధికారులు, సీఎస్‌డీటీ ఓబయ్య, డైరెక్టర్లు పట్టుకోట రఘు, సురేష్‌రెడ్డి, పేర్నాటి రాహుల్, బైనా మల్లికార్జున్‌రెడ్డి, పేట చంద్రారెడ్డి, కటకం జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

సైదాపురం: మహిళా ఉద్యోగుల పట్ల ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ గోపాలకృష్ణ అధ్యక్షతన మహిళ సాధికారిత నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీకి ఎలాంటి ఫిర్యాదులు అందినా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ హైమావతి, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్‌లో చేరితే పథకాల ఫలాలు

చిట్టమూరు: మండలంలోని రొయ్యల రైతులు ఆక్వా జోన్‌లో చేరితే ప్రభుత్వ పథకాల ఫలాలు పొందవచ్చని ఫిషరీస్ అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని కోగిలి సచివాలయంలో ఆక్వా రైతులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆక్వా జోన్‌లో చేరితే వర్తించే ప్రభుత్వ పథకాలు, పొందే విద్యుత్ రాయితీల గురించి వారికి తెలియజేశారు. రొయ్యల రైతులు దీనిని సద్వినియోగం చేసుకునేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షేక్ రెహ్మాన్, రొయ్యల రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారులకు సన్మానం



చిట్టమూరు : కొత్తగుంట సబ్ స్టేషన్ పరిధిలో పని చేసి బదిలీపై వెళ్లి ట్రాన్స్‌కో ఏడీ రాము, ఏఈ నాగప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మురళి, ఏఏఓ ఏడుకొండలు, లైన్‌మెన్లు బాబు, నరహరి సుధాకర్ రెడ్డి, కోటయ్య మారుతిని సత్కరించారు. ఏడీ దామోదర్, ఈఈ ఇస్మాయిల్ , లైన్‌మెన్లు పాల్గొన్నారు.

హోంగార్డులకు యూనిఫాం పంపిణీ


హోమ్‌గార్డులకు యూనిఫాం అందజేస్తున్న చంద్రశేఖర్, సెల్వం తదితరులు


చిల్లకూరు : పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు


గూడూరు : పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గూడూరు: స్థానిక ప్రగతి సేవా సంస్థ హోంగార్డులకు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేసింది. సెల్వం దాతృత్వంతో వీటిని అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కే.చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాము, కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు, నిత్యావసర సరుకులు..

నాయుడుపేటటౌన్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం పట్టణానికి చెందిన అత్తికాయల సుబ్రహ్మణ్యం దుస్తులతోపాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం మొదలైనవి అందజేశారు. పిండివంటలు చేయడానికి నగదు సాయం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్ని కృతజ్ఞతలు తెలిపారు.


నాయుడుపేట టౌన్ : వృద్ధులకు దుస్తులు, నిత్యావసర సరకులు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

చేడిమాలలో పేదలకు దుస్తులు..

చిల్లకూరు: మండలంలోని చేడిమాలలో శుక్రవారం రాజినేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సుమారు 200 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేసింది. ట్రస్ట్ అధినేత శ్రీనివాసులు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని గ్రామంలోని ప్రతి కుటుంబానికి బట్టలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పిచ్చయ్యనాయుడు, ప్రతినిధులు రామానాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు,శిరీష తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'లయన్స్ క్లబ్' దుప్పట్లు..

గూడూరు: సామాజిక సేవా కార్యక్రమాల్లో గూడూరు లయన్స్ క్లబ్ ముందుందని ఆ క్లబ్ రీజియన్ చైర్మన్ పీ.శ్రీరాములు అభినందించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో 100 పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీరాములుతోపాటు డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ గిరినాథ్, ఎం.మురళీరెడ్డి, ఎం.రూపేష్‌రెడ్డి, వీ.రామ్మోహన్ రావు, ఇలియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు


రాపూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి


కలువాయి: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

రాపూరు: రాపూరులో జిల్లా స్థాయిలో జరిగే గ్రిగ్ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. 98వ గ్రిగ్ మెమోరియల్ టోర్నమెంట్‌లో భాగంగా సెకండరీ స్కూల్స్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను రాపూరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయని, 15,16,17 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం ఇవ్వాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం భూమిని పంపిణీ చేయనుందని తెలిపారు. ఎంపీపీ చెన్ను బాలకష్టారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చెన్ను తిరుపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రాజు, ఎంపీడీఓ అమోస్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నూనకపల్లెలో రూ.10 లక్షలతో తాగునీటి పనులు

కలువాయి: నూనకపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమాశంలో ఆయన మాట్లాడుతూ నూనక పల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు, జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు, సత్వరమే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలువాయి ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో 250 సీట్ల కెపాసిటీ కాన్ఫరెన్స్ హాలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పెంచల నరసారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా సుబ్బరామిరెడ్డి, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ నారాయణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

"అబద్ధాల బాబూ.. ఇదేం ఖర్మ మాకు"


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు అబద్ధాలు చెప్పి రైతులను, మహిళలను, నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు డ్రామాలను చూసి 'అబద్ధాల బాబూ.. ఇదేం ఖర్మ మాకు' అంటూ ప్రజలు తల బాదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం తాళ్వాయిపాడు సమీపంలోని హైవే క్రాస్ హోటల్లో విలేకరులతో మాట్లాడారు. తాను 14 ఏళ్ల ముఖ్యమంత్రిని అంటూ రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన చంద్రబాబు, రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారకుడన్నారు. వార్డు మెంబరుగా కూడా గెలవలేని లోకేష్ ను మంత్రిని చేసిన బాబు మంగళగిరిలో అభాసుపాలైన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. అలాంటి వారు పాదయాత్రలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. మాట తప్పని, మడమ తిప్పని జన హృదయ నేత జగనన్న మరో 30 ఏళ్ల సీఎంగా ఈ రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మునివర్ధన్‌రెడ్డి, చక్రపాణి, మణి ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌లో 'కొక్కొరొకో'


కోడి పందాలరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ శనివారం రాత్రి కోడిపుంజుల కొక్కొరొకో కూతలు పాదచారులను ఆకర్షించాయి. అవేం కూశాయంటే... మండలంలోని మంగళపాడు గ్రామ అటవీ ప్రాంతాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం ఎస్ఐ రవిబాబు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దీంతో కొందరు పిక్కబలం చూపి పరుగో..పరుగు..! పోలీసులు వెంటాడి కోడిపుంజులతో సహా నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2200 స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో సహా పుంజులను పోలీస్‌స్టేషన్‌కు తేవడంతో అవి కూతలేస్తూ పందాల యవ్వారాన్ని చెప్పకనే చెప్పాయి. అవి పదే పదే కూతలేస్తూండడంతో వాటిని స్థానికంగా నాటుకోళ్ల పెంపకందారుల వద్దకు తరలించారు.

కోడి పందేలపై పోలీసుల నిఘా

దొరవారిసత్రం : మండలంలో కోడి పందేల స్థావరాలపై స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఎస్ఐ తిరుమలరావు సిబ్బందితో కలిసి అయ్యపాళెం, మేలుపాక, వెదురుపట్టు, మోదుగులపాళెం, మీజూరు, శ్రీదనమల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. గతంలో పట్టుబడిన పలువురు జూదర్లను బైండోవర్ చేశారు.

నాయుడుపేటటౌన్: కోడి పందేలు ఎక్కడా జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎస్‌ఐలు టీసీ కృష్ణయ్య, కె.శ్రీకాంత్, ఎం వేణుగోపాల్ పోలీసులతో పాటు గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులతో కలిసి మండలంలోని గ్రామాల్లో పహారా కాస్తున్నట్లు వెల్లడించారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

సైదాపురం: సంక్రాంతి వేడుకల్లో జూదం, కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సైదాపురం ఎస్ఐ ఉమాశంకర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూదం , కోడి పందేలు, అక్రమ మద్యం విక్రయాలు, రవాణా , బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

కోలాహలంగా 'భోగి'


పెళ్లకూరు : శిరసనంబేడులో వేసిన భోగి మంటలు


వెంకటగిరి: ముగ్గుల పోటీల్లో మహిళలు


వెంకటగిరి పోలేరమ్మ ఆర్చిసెంటర్‌లో జనం రద్దీ

పెళ్లకూరు: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని పలు ప్రాంతాల్లోని యువకులు శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు భోగిమంటలను ఉత్సాహంగా వేశారు. ఓ వైపు దట్టంగా మంచు కురుస్తున్నా, చలి గజగజలాడిస్తున్నా లెక్క చేయకుండా వివిధ గ్రామాల్లోని ప్రధాన వీధులు, ముంగిళ్ల వద్ద భారీ స్థాయి భోగిమంటలు వేశారు. తొలి పండుగ భోగిని చిల్లకూరు, పెళ్లకూరు, శిరసనంబేడు, నెలబల్లి, తాళ్వాయిపాడు తదితర గ్రామాల్లోని ప్రజలు భోగిని ఘనంగా జరుపుకున్నారు.ఇళ్ల ముంగిట యువతులు, మహిళలు అందమైన రంగవల్లులు ఆకర్షణీయంగా వేశారు.

రంగవల్లులు..సంప్రదాయాలకు ప్రతీకలు

వెంకటగిరి: రంగవల్లులు సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకలని ప్రణతి సాహితి సేవా సమితి అధ్యక్షుడు సుంకర రవికుమార్ అన్నారు. పట్టణంలో ధర్మరాజస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం కోకోకోలా కంపెనీ ప్రతినిధులు సంక్రాంతి ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఆ కంపెనీ మార్కెటింగ్ టీమ్ లీడర్ కె.హేమమహేష్, ప్రణతి సంస్థ సభ్యులు నర్రా రవి రమణ, కె.భ్యాలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో సంక్రాంతి సందడి

పట్టణంలో సంక్రాంతి సందడి శుక్రవారమే మొదలైంది. పండుగకు అవసరమైన వస్తువుల కొనుగోలు చేసేందుకు డక్కిలి, బాలాయపల్లె మండలాల నుంచి కూడా గ్రామీణులు తరలిరావడంలో పట్టణంలో బజారువీధి, కాశీపేట, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ప్రాంతాలు రద్దీగా మారాయి. నిత్యావసరాలు, రెడీమేడ్ షాపులు, గృహోపకరణాల దుకాణాలు కిటకిటలాడాయి. అలాగే విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా పండుగకు స్వగ్రామాలకు తరలి రావడంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు కూడా రద్దీగా కనిపించాయి.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. బజారు వీధులు, మార్కెట్ సెంటర్, పాత బస్టాండు, జీఎస్‌టీ రోడ్డు, రైల్వే స్టేషన్ కూడలి, వైఎస్సార్ సర్కిల్, బేరిపేట, వెల్‌కం సెంటర్, పడమటి వీధి, గాంధీమందిరం, పిచ్చిరెడ్డితోపు తదితర ప్రాంతాల్లో కూడళ్ల వద్ద యువత పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సందడి చేసింది.

సంక్రాంతి వ్యాపారం జోరు

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బజారు ప్రాంతాలు వివిధ ప్రాంతాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. పూజాసామగ్రి, దుస్తులు, ఇతరత్రా వాటిని కొనుగోళ్లకు వచ్చిన వారితో దుకాణాల్లో రద్దీ కనిపించింది.

పాఠశాలలో జేడీల తనిఖీలు

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు గ్రామ ప్రాథమిక పాఠశాలను స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మేరీ చంద్రిక, ఏపీ రెసిడెన్షియల్ జేడీ పీఎం శ్రీ శనివారం సందర్శించారు. మరుగుదొడ్లు, భవన నిర్మాణాలు, లేబ్‌లను తనిఖీ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

PASSPORT MISSING

I, ELIKINTY SAI KUMAR S/o. Elikinty RaviKumar, Residing at D.No 9-210-1, Weavers Colony, Venkatagiri Town, Tirupathi dt, AP, I have Lost My Passport Bearing No. W5866278 While Loss of My Original Passport My Home Town Venkatagiri. I Reported The Matter To S.H.O. Venkatagiri On 13-1-2023. If Anyone Found Please inform at The Above address.